చదువు విలువ తెలిపేందుకే బడిబాట

డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ వ్యవస్థాపకురాలు చావ అరుణ

బడిబాటలో భాగంగా డ్రీమ్ ఫర్ సొసైటీ సభ్యులతో కలిసి కాలనీ, బస్తీల్లో తిరుగుతూ విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తున్న డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ వ్యవస్థాపకురాలు చావ అరుణ

మాదాపూర్, జూన్ 9: మాదాపూర్ గోకుల్ ప్లాట్స్‌లోని డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ వ్యవస్థాపకురాలు చావ అరుణ మాట్లాడుతూ.. జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి వలంటీర్లు, విద్యార్థులతో కలిసి విద్యపై అవగాహన కల్పించేందుకు 'బడిబాట' కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్, వెంకటరమణ కాలనీతోపాటు వీకర్ సెక్షన్ కాలనీల్లో వలంటీర్లు, విద్యార్థులతో కలిసి తిరిగి పిల్లల తల్లిదండ్రులకు విద్యప్రాముఖ్యతను వివరించారు. దీంతో పలువురు తల్లిదండ్రులు వారి చిన్నారులకు విద్యను అందించడానికి ఒప్పుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐజీ హాస్పిటల్ వైద్యులు కల్యాణ్, జేఎన్‌టీయూ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి 'ప్రజావాణి'

కుత్బుల్లాపూర్, జూన్ 9: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమం నేటి నుంచి పునఃప్రారంభం కానున్నది. ఎన్నికల దృష్ట్యా గత కొన్ని రోజులుగా 'ప్రజావాణి' వాయిదా పడగా.. తిరిగి నేటి నుంచి మండల రెవెన్యూ, జీహెచ్ఎంసీ సర్కిల్, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు అధికారులు ప్రజా సమస్యలను స్వీకరించేందుకు అందుబాటులో ఉండే అవకాశం ఉన్నది. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయా శాఖల అధికారులు కోరుతున్నారు.

బాలానగర్‌లో...

బాలానగర్, జూన్ 9:కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ తెలిపారు. 'ప్రజా వాణి' సందర్భంగా జోనల్ కార్యాలయంలో ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు తమ తమ సమస్యలను విన్నవించుకోవచ్చని సూచించారు. విన్నపాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ ప్రజావాణి జోనల్ కార్యాలయంతో పాటు అన్ని సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు గమనించి తమ విన్నపాలను తెలియజేయాలని సూచించారు.

విద్యుత్‌కు అంతరాయం

బాలానగర్, జూన్ 9 : 33/11 కేవీ విద్యుత్ మరమ్మతు పనులు, చొట్ల కొమ్మల తొలగింపుతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్ (సీబీడీ) ఏడీఈ పణ్యాల శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ప్రశాంత్‌నగర్ సబ్ స్టేషన్, ఆంధ్రజ్యోతి ఫీడర్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్, న్యూ రాజీవ్‌గాంధీనగర్ వెంచర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ప్రాగా టూల్స్ సబ్ స్టేషన్ ఈశ్వర్ విమల్ ఫీడర్ పరిధిలోని గాంధీనగర్, శివాజీ విగ్రహం, ఆల్ఫా కాంప్లెక్స్, ఈశ్వర్ విమల్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా : ఎమ్మెల్యే కృష్ణారావు



రాజ్‌కుమార్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, జూన్ 9: అధైర్యపడొద్దు అండగా ఉంటానని బీఆర్ఎస్ నేత రాజ్‌కుమార్‌గౌడ్‌కు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భరోసా కల్పించారు. ఆదివారం మూసాపేటలోని ఆయన నివాసానికి తూము శ్రావణ్‌కుమార్‌తో కలిసి వెళ్లి రాజ్‌కుమార్‌గౌడ్‌ను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. మనిషి జీవితంలో అనేక ఆటుపోట్లు ఎదరువుతూ ఉంటాయని, వాటిని అధిగమించి ముందుకు వెళ్తేనే జీవితానికి పరమార్థం లభిస్తుందన్నారు. సమస్యలు వచ్చినప్పుడు సతమతం కాకుండా సమన్వయంతో వ్యవహరించినప్పుడే ఆ సమస్యలు ఏదో ఒక విధంగా పరిష్కారం కావడానికి మార్గం సులువు అవుతుందన్నారు.

యువత స్వయం శక్తితో ఎదగాలి

యువత స్వయం శక్తితో ఎదిగి పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్ లో శ్యామ్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి భవిష్తత్తులో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పిల్లి తిరుపతి, జ్ఞానేశ్వర్, విజయ్‌గౌడ్, మధురాచారి, సుభాన్‌బాబు మియా, శివ, రామ్‌రెడ్డి, చాంద్ సాబ్,యోగి రాజు తదితరులు పాల్గొన్నారు.

– అల్లాపూర్, జూన్ 9

వీధి కుక్కలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు

శ్రీకృష్ణానగర్, సత్యసాయికాలనీలో వీధి కుక్కలను పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది. చిత్రంలో కమిషనర్ సత్యనారాయణరావు ఉన్నారు.

దుండిగల్,జూన్9:వీధి కుక్కల వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణరావు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని డీ.పోచంపల్లి, 10వ వార్డులోని శ్రీకృష్ణానగర్, సత్యసాయికాలనీలో శనివారం వీధి కుక్కలు 15నెలల చిన్నారి ఆరుషిపై దాడికి పాల్పడి గాయపరిచిన నేపథ్యంలో ఆదివారం కమిమీషనర్ సత్యనారాయణరావు బ్లూ క్రాస్ సొసైటీ వారిని సంప్రదించి యానిమల్ కంట్రోల్ బర్త్ వ్యాన్ (డాగ్స్ క్యాచ్ వ్యాన్) పిలిపించి, మున్సిపాలిటీ అన్ని వీధుల్లో ఉన్న కుక్కలను పట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధి కుక్కల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కుక్కల బెడదను నివారించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదే విధంగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా కుక్కల సమస్య ఉన్నట్లైతే 99487 9555, 95427 15377 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే బ్లూ క్రాస్ సొసైటీ వారి ద్వారా కుక్కలు తీసుకొపోయి ట్రీట్ మెంట్ ఇప్పించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

వెల్డింగ్ చేస్తుండగా పేలిన కెమికల్ ట్యాంకర్

వెల్డర్‌కు తీవ్రగాయాలు

దుండిగల్, జూన్ 9: కెమికల్ ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తుండగా.. పేలడంతో వెల్డర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గాగిళ్లాపూర్‌లోని ఖాజీపల్లి చౌరస్తాలో గాజుల రామారానికి చెందిన ఫారూక్(33) అనే వ్యక్తి గత కొంత కాలంగా వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం దుండిగల్ తండాకు చెందిన ప్రేమ్ అనే వ్యక్తికి సంబంధించిన ఖాళీ కెమికల్ ట్యాంకర్‌కు ఫారూక్ వెల్డింగ్ చేస్తున్నాడు. వెల్డింగ్ చేస్తున్న సమయంలో ట్యాంకర్ పైన ఉండే మూత తెరువకపోవడంతో లోపల గ్యాస్ ఏర్పడి ఒక్కసారిగా పేలింది. ఈ సంఘటనలో వెల్డింగ్ చేస్తున్న ఫారుక్‌కు తీవ్రగాయాలు కాగా, స్థానికులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం సూరారంలోని మల్లారెడ్డి వైద్యశాలకు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీవ్రంగా గాయపడిన వెల్డర్ ఫారూక్

అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

మల్లాపూర్, జూన్ 9: భవిష్యత్ తరాల కోసం రాజ్యాంగ నిర్మాతగా సామాజిక న్యాయం కోసం పోరాడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సంఘ సంస్కర్త, రాజకీయ వేత్తగా చదువుకు దూరమై దుర్భర జీవితం గడుపుతున్న పీడిత దళిత కోసం శ్రమించిన యోధుడు మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను యువత ముందుకు తీసుకుపోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ చౌరస్తాలో అరుంధతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, సాయిజన్‌శేఖర్, మాజీ కార్పొరేటర్లు జి. శ్రీనివాస్‌రెడ్డి, కొత్త రామారావు, అంజయ్య, ఎమ్మార్పీస్ నాయకుడు బాబు మాదిగ, బీఆర్ఎస్ నాయకులు అరుంధతి సక్షేమ సంఘం సభ్యులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీలకు అభినందనలు

ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో పలువురు కుత్బుల్లాపూర్ బీజేపీ నేతలు ఆదివారం ఢిల్లీకి తరలివెళ్లారు. సీనియర్ నేత మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్, నేతలు తెలంగాణ ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వరరెడ్డి, ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి మరింత చేయూత లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

– జగద్గిరిగుట్ట, జూన్ 9

రామోజీరావు సేవలు చిరస్మరణీయం

రామోజీరావు అంత్యక్రియలో పాల్గొన్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

మాజీ మంత్రులు, సహచర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి అంత్యక్రియలలో పాల్గొన్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్/జగద్గిరిగుట్ట, జూన్ 9: ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం ఫిల్మ్ సిటీలో జరిగాయి. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాజీ మంత్రులు, సహచర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి అంత్యక్రియలలో పాల్గొన్నారు. రామోజీరావు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన మరణం యావత్ పత్రికా రంగానికి తీరనిలోటని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.

– జగద్గిరిగుట్ట : తెలుగు సమాజానికి రామోజీరావు చేసిన సేవలు గొప్పవని ఐఎన్‌టీయూసీ నేతలు అన్నారు. రామోజీ చిత్రపటానికి జగద్గిరిగుట్టలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. జర్నలిజంతోపాటు అనేకరంగాల్లో ఉపాధికల్పించి ఉన్నత ప్రమాణాలు నెలకొల్పారన్నారు. ఆయన స్ఫూర్తిని అన్నిరంగాల వారు కొనసాంచాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్, మాజీ కౌన్సిలర్ వరమ్మ, సాయిప్రవీణ్, యాదగిరి, సులోచన, తిరుపతమ్మ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

అలుపెరుగని అక్షర యోధుడు రామోజీ..

సంతాపం ప్రకటించిన తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ

దుండిగల్, జూన్ 9: ఈనాడు మీడియా గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు మృతి పట్ల తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సంతాపాన్ని తెలియజేసింది. ఈమేరకు ఆదివారం రాష్ట్ర కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ, రాష్ట్ర అధ్యక్షుడు కట్కూరి మల్లేశ్ మాట్లాడుతూ.. రామోజీరావు పాత్రికేయ రంగంలో చెరగని ముద్ర వేశారన్నారు. పత్రికా స్వేచ్ఛను, జర్నలిజం విలువలను కాపాడేందుకు విశేష కృషి చేశారని అన్నారు. పత్రికా రంగంలో రామోజీరావు ఒక నూతన ఒరవడిని సృష్టించారని, ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఎందరో జర్నలిస్టులను తయారు చేసి తెలుగు సాహిత్య, సమాచార భివృద్ధికి నిత్యం కృషి చేశారన్నారు. తెలుగు భాషకు, తెలుగు మీడియా రంగానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని, ప్రజాస్వామ్య పరిరక్షణకు రామోజీరావు ఉద్యమ స్ఫూర్తితో పని చేశారన్నారు. నైతిక విలువలు పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచిన మహనీయుడని వారు కొనియాడారు. రామోజీరావు మృతికి సంతాపం తెలియజేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశాస్తున్నామన్నారు. రామోజీరావు మృతి పట్ల తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వారం రోజులపాటు అన్ని ప్రాంతాల్లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించాలని కోరారు.

విద్యార్థి చదువుకు చేయూత

దుండిగల్, జూన్ 9: చదువులో ప్రతిభ ఉండి పేదరికంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్) చేయూత నిచ్చారు. ప్రతిభావంతులకు నేను అండగా ఉన్నానంటూ నిరూపించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్-2కు చెందిన కృష్ణ, సంగీతల కుమార్తె భూమిక ఇంజినీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్నది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో తమ కూతురు ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించాలంటూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించగా, సానుకూలంగా స్పందించి కేఎస్ఆర్ భూమిక ఫీజు డబ్బులను తాను భరిస్తానంటూ కృష్ణ, సంగీత దంపతులకు ఆర్థిక సాయం చేశారు. అనంతరం భూమిక తల్లి దండ్రులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నరసింహ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ పునరుద్ధరణకు సహకారం

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని శివాలయం-నల్లపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం కేఎస్ఆర్‌ను కలిసి ఆలయంలో జరుగుతున్న పునరుద్ధరణ పనులపై చర్చించారు. ఆలయానికి రంగులు వేయడం, రాబోవు బోనాల పండుగ గురించి చర్చించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు, రాంచందర్, వెంకటేశ్, సీహెచ్. రామోజీ, వి.వి.రమణ, సత్యనారాయణ, లక్ష్మణ్, ఆటో శ్రీను, గౌసుద్దీన్, మెయినుద్దీన్, రామకృష్ణ, ఉష తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, జూన్ 9: వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆదివారం పలువురి నృత్యకారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కూచిపూడి నృత్య గురువు శ్రీలక్ష్మీ శాంకరి శిష్య బృందం ప్రదర్శించిన పలు అంశాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో వినాక కౌతం, బ్రహ్మాంజలి, జతిస్వరం, జయ జయ దుర్గే, నీలమేఘ శరీర, దశావతారం, కొలువై ఉన్నడే, ఇందేందువచ్చితివిరా, నారాయణతే నమో నమో, హిందోళ తిల్లాన, మని నూపుర ధరి, చక్కని తల్లికి అంశాలను లహరి, మనస్విని, సంజన, శరణ్య, కాజోల్, లిఖిత, శ్రీజ, కావ్య, తపస్య, సంప్రీతిలు కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించి అలరించారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

అక్రమ నిర్మాణం.. ఆపై చెట్ల నరికివేత

బిల్డింగ్ ఎదుట నరుకుతున్న చెట్లు

జగద్గిరిగుట్ట, జూన్9 : ఇండస్ట్రియల్ అధికారులు, మున్సిపల్ యంత్రాంగం రెండింటి పర్యవేక్షణలో ఉన్న రంగారెడ్డినగర్‌లో సమన్వయం కొరవడుతున్నది. రంగారెడ్డినగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో ఇండ్ల మధ్యలో అనుమతిలేని పరిశ్రమలు, పరిశ్రమలు ఉండాల్సిన చోట కమర్షియల్ నిర్మాణాలు వెలుస్తున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ బ్రైట్‌కాన్సెప్ట్ స్కూల్ సమీపంలోని ప్రధాన రహదారిలో ఇటీవల సెట్‌బ్యాక్ లేకుండా భారీ బిల్డింగ్ నిర్మించారు. భవనానికి అడ్డుగా ఉన్నాయని ఆదివారం పచ్చని చెట్లను నరికివేశారు. ఏపుగా పెరిగిన వాటిని కొట్టేయడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆహార పదార్థాల పంపిణీ

డిగ్నిటీ డ్రైవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకే ఎన్‌క్లేవ్‌లో ఆదివారం పేదలకు ఆహార పదార్థాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బమ్మిడి సాహిత్య మాట్లాడుతూ.. పేదల ఆకలి తీర్చేందుకు సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని, ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. పేదలు నివసించే కాలనీలు, దవాఖానలు సహా ఇతర జన సమ్మర్థ ప్రాంతాల్లో కొన్నేండ్లుగా పేదలకు ఉచితంగా ఆహార పదార్థాలు అందిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు రేనే గ్రేస్ తెలిపారు. ఇప్పటికే నగర వ్యాప్తంగా వెయ్యికి పైగా అన్నార్థుల ఆకలి తీర్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమలాకర్, రాబిన్ హుడ్ ఆర్మీ సభ్యులు పాల్గొన్నారు.

– మియాపూర్, జూన్ 9

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్,జూన్9 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాంనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి చౌరస్తా నుంచి బొల్లారం వెళ్లే మార్గంలో వైన్స్‌షాప్ సమీపంలో ఉన్న సుమారు 30 నుంచి 40 ఏండ్ల వయస్సు మధ్య గల ఉన్న వ్యక్తి క్రీమ్ కలర్ స్మాల్ షర్ట్, నేవిబ్లూ లోయర్, ఎల్లో కలర్ జీన్స్ సిలువ చైన్ ధరించి ఉన్నాడని గుర్తించారు. గత నాలుగు ఐదు రోజుల కిందటనే మృతి చెంది ఉంటాడని, మృతదేహం పూర్తిగా పురుగులు పట్టి ఉందని, గాంధీ వైద్యశాలకు తరలించామని, ఆచూకీ తెలిసిన వారు స్థానిక పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సంప్రదించాలని కోరారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

మల్లాపూర్, జూన్ 9: ఉద్యమకారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షుడు తాడూరి గగన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం ఆదివారం ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తానన్న హామీని వెంటనే అమలు చేయాలనారు. అదే విధంగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు ప్రత్యే కమిటీ ఏర్పాటు చేసి ఉచిత బస్‌పాస్, ఆరోగ్య బీమాను ఇవ్వాలని,మెడికల్ కార్డు, ప్రతీ నెల పింఛన్, ఉద్యమకారుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి నిధిని కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి నర్సింహారెడ్డి, సభ్యులు వీరాచారి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో నేడు మహాన్యాస రుద్రాభిషేకం

కీసర, జూన్ 9: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామికి సోమవారం గర్భాలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లఆలయ చైర్మన్ నాగలింగంశర్మ తెలిపారు.